



శాంతిపురంలో మహిళల ముఖాముఖిలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

'**నా** ఫ్రెండు ఒకరు చెప్పారు, బయట తిరగొద్దని. ఈ ప్రభుత్వం ఏమైనా చేస్తుందని, ఎంతకైనా తెగిస్తుందని భయపెట్టారు. కానీ, నా బిడ్డలున్నారన్న నమ్మకంతోనే నాతో సహా చంద్రబాబు, లోకేశ్ రాష్ట్రంలో పర్యటిస్తున్నాం. ఈ ప్రభుత్వ అరాచకాలనుంచి రాష్ట్రాన్ని, మిమ్మల్ని కాపాడుకోవడానికి అహర్నిశలు ప్రయత్నిస్తున్నాం' అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమ పర్యటనలో భాగంగా బుధవారం ఆమె శాంతిపురంలో 'ఆడబిడ్డలకు ఆర్థికస్వేచ్ఛ' అంశంపై మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. మహిళల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

- కుప్పం/శాంతిపురం

## నా బిడ్డలున్నారన్న నమ్మకంతోనే

# మీ ముందుకు వచ్చాం

**ప్రభుత్వ అరాచకాలనుంచి రాష్ట్రాన్ని కాపాడు కోవడానికి ప్రయత్నిస్తున్నాం**

**'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' ముఖాముఖిలో నారా భువనేశ్వరి**



**మమత, కర్లగుట్ట: చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు 53 రోజులపాటు మీరెలా గడిపారు? మీరు ఎదుర్కొన్న సమస్యలేమిటి?**

**భువనేశ్వరి:** చంద్రబాబు అరెస్టు విషయంలో ఏమాత్రం భయపడలేదు. ఆయన చాలా ధైర్యంగా ఉన్నారు. ఆయన జైలుకు వెళ్లడంతో బాధపడిన, మనస్తాపంతో చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించమన్నారు. ధైర్యం చెప్పమన్నారు. జైల్లో ఉండీ ఈయన ఏమిటి ప్రజల గురించి ఆలోచిస్తున్నారని నేను కొంత నిరాశ చెందిన మాట నిజం. కానీ ఆయన అక్రమ కేసులో నిర్బంధానికి గురైనప్పుడు మీరు పడిన బాధ, నిర్బంధాలు, పోలీసు ఆంక్షలకు వెరవకుండా చేసిన నిరసనలు చూసి నేను చాలా ప్రభావితురాలయ్యా. మీ కుటుంబాలను ఓదార్చి, భరోసా ఇవ్వడానికే ఈ పర్యటనలు పెట్టుకున్నా.



**విజయలక్ష్మి, గుండిశెట్టిపల్లె: భోంచేసేటప్పుడు ఏ విషయాల గురించి ఎక్కువగా చర్చింకుంటారు?**

**భువనేశ్వరి:** కనీసం భోజనం సమయంలోనైనా కుటుంబ విషయాలు మాట్లాడుదామంటే ఇటు తిరిగి, అటు తిరిగి చంద్రబాబు ప్రజలవద్దకే వస్తారు. లోకేశ్‌కన్నా షార్ప్‌గా ఆలోచిస్తారు. 2047 విజన్‌తో ముందుకెళుతున్న ఆయన్ను పట్టుకుని ఈ ప్రభుత్వం వయసైపోయింది అంటుంది. కానీ ఆయన ఇంకా యంగ్‌స్టర్. ఆయనలా ఆలోచిస్తున్నాడు కాబట్టే నేనిలా నిజం గెలవాలి కార్యక్రమంలో మీ ముందుకు వచ్చా. మీరు చూపిస్తున్న ప్రేమానురాగాలను ఎప్పటికీ మరవలేం.



**కౌసల్య, కుప్పం: నృత్య తదితర కళలను మీరెలా ప్రోత్సహిస్తారు?**

**భువనేశ్వరి:** నేను వెంకట చినసత్యం దగ్గర కూచిపూడి, భరతనాట్యం 11 సంవత్సరాలు నేర్చుకున్నా. నాకు కళలంటే చాలా ఇష్టం. చంద్రబాబు కూడా అధికారంలో ఉన్నప్పుడు కళాకారులను ప్రోత్సహించారు. మళ్లీ అధికారంలోకి వస్తే మరింత ప్రాధాన్యం ఇస్తారు.



**జ్యోత్స్న, కొలమడుగు: గార్మెంట్స్‌లో పనికోసం మేము శాంతిపురంనుంచి కుప్పం వెళ్తున్నాం. ఇక్కడే మాకు పరిశ్రమలు తెస్తే బావుంటుంది.**

**భువనేశ్వరి:** చంద్రబాబు అధికారంలో ఉండగా కుప్పంలో పరిశ్రమలు చాలా వచ్చాయి. ఈ ప్రభుత్వం వచ్చాక వచ్చిన పరిశ్రమలు కూడా వెనక్కి వెళ్లిపోయాయి. జిల్లాలో అమరరాజా, అనంతపురంలో జాకీ పరిశ్రమలు వెళ్లిపోయాయి. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం.



**సంపూర్ణ, గరిగచీనేపల్లె: నా పెద్ద కొడుక్కి యాక్సిడెంట్ అయింది. సారు ఉన్నప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నా. ఈ ప్రభుత్వం నేను టీడీపీ అని పక్కన పెట్టేశారు. మా కుటుంబంలోనే గొడవలు పెట్టారు.**

**భువనేశ్వరి:** ఈ ప్రభుత్వం ప్రజలకు సాయం చేయడం మాని, హింసిస్తోంది. కుటుంబాల మధ్య గొడవలు పెడుతోంది. మీకు సాయం చేయడానికి మేమున్నాం. మన ప్రభుత్వం వచ్చాక సీఎం రిలీఫ్ ఫండ్‌తో పాటు ఇతర సాయం చేసే బాధ్యత నాది. ధైర్యంగా ఉండండి.



**యువతేజస్విని, పెద్దబొమ్మనపల్లె: కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విద్యాసంస్థలు ఏర్పాటు చేసి పేదలకు ఉచిత విద్య అందించాలి.**


**భువనేశ్వరి:** నాకు కూడా ఇంతదాకా ఈ ఆలోచన రాలేదు. మంచి సలహా ఇచ్చావు. కచ్చితంగా మా మేనేజ్‌మెంట్‌తో ఆలోచన చేసి స్కూల్ ఏర్పాటు చేస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌నూ త్వరలో ప్రారంభిస్తాం.

## మీవల్లే ఈ అభ్యున్నతి

● భువనేశ్వరి ముందు పొంగిపోయిన మహిళలు, విద్యార్థులు

కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 21: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన పథకాలు, ఏర్పాటు చేసిన విద్యా సంస్థలవల్ల తాము ఎంతో ఉన్నతిని సాధించామని పలువురు మహిళలు, విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. భువనేశ్వరితో ముఖాముఖి సందర్భంగా వీరు తాము సాధించిన విజయాలను ఏకరువు పెట్టారు.

### పట్టు పురుగుల పెంపకంతో కుటుంబ పోషణ



చంద్రబాబు సారు నియోజకవర్గంలో పట్టు పురుగుల పెంపకాన్ని ప్రోత్సహించారు. ఎన్నో సబ్సిడీలు ఇచ్చారు. ఆ ప్రోత్సాహంతోనే పట్టుపురుగుల పెంపకాన్ని ఆధారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ముగ్గురు బిడ్డలను ఉన్నత చదువులు చదివించుకుని ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. ఇప్పుడున్న ప్రభుత్వం పట్టుపరిశ్రమను పట్టించుకోవడంలేదు. సబ్సిడీలను, ప్రోత్సాహాలను నిలిపేసింది.

**- సరిత, ఎం.శాంతంపల్లె**

### భవిష్యత్తు బాగు చేసిన చంద్రబాబుకే నా ఓటు



కుప్పంను ఎడ్యుకేషన్ హబ్‌గా చేయాలనే సంకల్పంతో చంద్రబాబు మౌంట్ ఫోర్ట్ స్కూల్ తీసుకొచ్చారు. అందులో చదువుకున్న నేను మంచి ర్యాంకు స్టూడెంట్‌నయ్యా. ఇప్పుడు ఎంబీబీఎస్ చేస్తున్నానంటే సార్ పుణ్యమే. ఆయన లేకపోతే మా తల్లిదండ్రుల ఆశలు నీరుకారిపోయేవి. నాకు ఉజ్వలమైన భవిష్యత్తు ఇచ్చిన చంద్రబాబుకే మొదటిసారిగా ఓటు హక్కు పొందిన నా ఓటు.

**- నైసీ, కుప్పం**

### పాడి పరిశ్రమతో అభివృద్ధి



చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఆవులు ఇచ్చి పాడి పరిశ్రమను అభివృద్ధి చేశారు. మేమూ ఆవులు పట్టుకుని పాలు అమ్ముకుని అభివృద్ధి చెందాం. ఆర్థికంగా కొంత ఆదరువు లభించింది. కానీ, నేడు పాడి గురించి, మా గురించి పట్టించుకునే వారే లేరు.

**- అమృత, మొరసనపల్లె**

### వందమందితో ఓటు వేయించేందుకు నేను సిద్ధం



కుప్పాన్ని అభివృద్ధి పథంలో నడిపిన చంద్రబాబు నాయుడికి లక్ష మెజారిటీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. నాతోపాటు మరో వందమందితో ఆయనకు ఓటు వేయించేందుకు నేను సిద్ధం. ప్రతిఒక్కరూ ఇలాగే ఆలోచించి బాబుకు అత్యధిక మెజారిటీ తేవాలి. అప్పుడు కుప్పం మరింతగా అభివృద్ధి చెందుతుంది.

**- వరలక్ష్మి, కుప్పం**



## జన నీరాజనం



● రెండో రోజు ఐదు కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ

చిత్తూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'నిజం గెలవాలి' అంటూ జిల్లాలో పర్యటిస్తున్న నారా భువనేశ్వరికి జనం నీరాజనం పలికారు. చంద్రబాబును జైలుకు పంపడంతో మనోవేదనకు గురై మృతిచెందిన వారి కుటుంబీకులను ఆమె పరామర్శిస్తున్నారు. రెండో రోజైన బుధవారం కుప్పంలో ఆమె పర్యటన మొదలైంది. కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు కోసం 23 రోజులు సైకిల్ యాత్ర చేసిన యువతను అభినందించి హెల్మెట్లు అందించారు. శాంతిపురంలో మహిళలతో ముఖాముఖి.. శాంతిపురం, రామకుప్పంలో అన్నక్యాంటీన్లను ప్రారంభించారు. అనంతరం పెద్దపంజాణి మండలం శివాడిలో పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. శివాడిలో కనకరాజు, కత్తార్లపల్లెలో శంకరప్ప.. పుంగనూరు మండలం ఎస్‌ఎస్‌పేటకు చెందిన నాదన్నగారి జయమ్మ, మంగళం పంచాయతీ చెలిమిగడ్డలో పాలెపల్లి పద్మావతి, ఒంటిమిట్టలో సొరకాయల శ్రీనివాసులు కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేశారు. పలుచోట్ల పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కాగా, భువనేశ్వరిని చూసేందుకు ఆయా గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ముందుగానే బాధిత కుటుంబం వద్దకు చేరుకుంటున్నారు. ప్రతిచోటా ఆమెకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఎక్కడైనా తన కోసం వేచిఉన్న ప్రజలు కనిపిస్తే కారు ఆపలి వాళ్లను పలకరిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు పులివర్తి నాని, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చల్లా రామచంద్రారెడ్డి, జగన్మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురంలో అన్నక్యాంటీన్ వద్ద భోజనం వడిస్తూ..



రామకుప్పంలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తూ..



పుంగనూరు మండలం ఈడిగపల్లెలో చిన్నారితో భువనేశ్వరి

### నేటి పర్యటన ఇలా..

మధ్యాహ్నం 12.10 గంటలకు పులిచెర్ల మండలం కమ్మపల్లి, 1.10 గంటలకు పడగాలవారిపల్లెలో.. 3.35 గంటలకు ఐరాల మండలం చింతగుంపలపల్లిలో.. సాయంత్రం 5.10కి బంగారుపాళ్యం మండలం టేకు మందలో.. 6.40 గంటలకు చిత్తూరు నగరం 50వ వార్డు కోకలూరులో.. రాత్రి 8 గంటలకు చిత్తూరు మండలం ముత్తుకూరులో కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించనున్నారు. ఆర్థికసాయం అందిస్తారు. రాత్రికి చిత్తూరులో బస చేయనున్నారు.

## బాలుడిది ప్రమాదం కాదు..హత్య

● నిందితులైన తల్లి, ప్రియుడి అరెస్టు

మదనపల్లె, ఫిబ్రవరి 21: మదనపల్లె మండలం చిప్పిలిలో నివాసం ఉంటున్న ఎం.మయూరి కుమారుడు ఎం.హరన్ సాకేత్(3) ప్రమాదంలో చనిపోలేదని, హత్య చేసినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆ కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. సీఐ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన ఎం.నాగరాజ, మయూరి భార్యాభర్తలు. వీరి కుమారుడు హరన్‌సాకేత్. మద్యం షాపులో పనిచేస్తున్న సి.శివశంకర్‌రెడ్డి అలియాస్ సి.శంకర్‌రెడ్డితో నాగరాజ స్నేహంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తరచూ ఇతడి ఇంటికి వస్తూ మయూరితో శివశంకర్‌రెడ్డికి ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. అనంతరం భర్త నుంచి విడిపోయిన ఆమె, మూడేళ్ల కుమారుడితో పాటు శివశంకర్‌రెడ్డితో కలసి మదనపల్లెకు వచ్చేసింది. బి.కొత్తకోట, మదనపల్లెలో కొంతకాలం నివాసం ఉంటూ తర్వాత చిప్పిలికి మకాం మార్చారు. అద్దె గదిలో ఉంటూ వీరిద్దరూ ఓ ప్రైవేటు కంపెనీకి రెండు నెలలుగా పనికి వెళ్తున్నారు. ఈనెల 13న మయూరి పనికి వెళ్లగా, ఇంటి వద్దే ఉంటున్న శివశంకర్‌రెడ్డి మూడేళ్ల బాలుడిని కొట్టాడు. అపస్మారక స్థితిలో ఉన్న హరన్‌సాకేత్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయాన్ని నిందితుడు మయూరికి చెప్పాడు. అసలు విషయాన్ని దాచేసి ఆడుకుంటూ నీటిసంపులో పడి మృతి చెందినట్లు అదే రోజు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరుసటిరోజు తండ్రి నాగరాజ, బిడ్డ మృతదేహంపై గాయాలు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి బాలుడి తల్లి మయూరి, ఆమె ప్రియుడు శివశంకర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శేఖర్

## మూడు వారాలవుతున్నా విధుల్లో చేరక..!

● ముగ్గురు ఇతర జిల్లాల తహసీల్దార్ల వైఖరిపై అధికారుల సీరియస్

● వీరిలో ఒకరు ప్రభుత్వ విప్ పీఎస్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 21: కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేర ఎన్నికల విధుల్లో సొంత జిల్లాల స్థానే జోన్ పరిధిలోని ఇతర జిల్లాల తహసీల్దార్లను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించడం సర్వసాధారణం. సొంత జిల్లాలో ఉంటే పోలింగ్ నాడు అభ్యర్థుల్లో కొందరికి మేలు చేకూర్చవచ్చన్న ఉద్దేశ్యంతో ఇలా బదిలీలు చేస్తారు. ఇలా గత నెలాఖరులో ఇతర జిల్లాల నుంచి చిత్తూరు జిల్లాకు, చిత్తూరు జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీలు జరిగాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 14 మంది, కర్నూలు జిల్లా నుంచి 13 మంది, వైఎస్సార్ కడప జిల్లా నుంచి నలుగురు వెరసి 31 మంది తహసీల్దార్లు జిల్లాకు వచ్చారు. వీరందరూ ఈనెల ఒకటో తేదీ వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు తీసుకోవాలి. వీరిలో ఇప్పటికీ ముగ్గురు బాధ్యతలు స్వీకరించలేదు. అనంతపురం జిల్లా నుంచి రాయదుర్గం తహసీల్దార్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పీఎస్‌గా పనిచేస్తున్న డి.నీలకంఠారెడ్డికి చౌడేపల్లి, నంద్యాల కలెక్టరేట్ కేఆర్‌సీసీ స్పెషల్ తహసీల్దార్ షేక హసీనాబీకి తవణంపల్లెకు, కర్నూలు ఆర్డీవో కార్యాలయ ఏవో ఐ.వేణుగోపాల్‌రావుకు కుప్పం ఆర్డీవో కార్యాలయ డివిజన్ ఏవోగా పోస్టింగ్స్ ఇచ్చారు. 21 రోజులు అవుతున్నా వీరు విధుల్లో చేరలేదు. వీరి గైర్హాజరు పట్ల జిల్లా యంత్రాంగం సీరియస్ అయింది. కేటాయించిన మండలాల్లో వెంటనే విధుల్లో చేరాలని, లేకుంటే ఎన్నికల సంఘం ఉత్తర్వులను అతిక్రమించినట్లు భావించి ఎన్నికల సంఘానికి నివేదిక పంపాల్సివుందని తెలుపుతూ తాజాగా రిమైండర్ లెటర్స్ పంపినట్లు తెలిసింది.

## వీధికి దివంగత సైనికుడి పేరు



పూతలపట్టు, ఫిబ్రవరి 21: దివంగత సైనికుడి పేరిట ఓ వీధికి నామకరణం చేసి, వీధిబోర్డును ఐటీబీపీ అధికారులు బుధవారం ఏర్పాటు చేశారు. పూతలపట్టు మండలం చిన్నబండపల్లి గ్రామానికి చెందిన వినాయకం ఐటీబీపీలో విధులు నిర్వహించేవారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన వరదముంపు ప్రాంతంలో భక్తులను కాపాడబోయి హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందారు. ఈ మేరకు ఐటీబీపీ అధికారులు బుధవారం చిన్నబండపల్లికి వచ్చి వినాయకం పేరుమీద వీధి బోర్డు ఏర్పాటుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.





పెద్దపంజాణి మండలం శివాడిలో కనకరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భువనేశ్వరి - కత్తార్లపల్లెలో శంకరప్ప సతీమణికి చెక్ అందిస్తున్న భువనేశ్వరి - పుంగనూరు మండలం ఎన్ఎస్‌పేటలోని జయమ్మ కుటుంబీకులకు చెక్కు అందజేత

# రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి

**వైసీపీ పాలనలో అన్నీ అరాచకాలే ● ఒంటిమిట్ట రచ్చబండలో నారా భువనేశ్వరి**



ఒంటిమిట్ట సభలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

పుంగనూరు, ఫిబ్రవరి 21: రాష్ట్ర అభివృద్ధి, పిల్లల భవిత కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్టలో బుధవారం రాత్రి రచ్చబండ వద్ద జరిగిన సభలో ఆమె మాట్లాడారు. అరాచకాలు, ఇసుక, మద్యం దోపిడీ దౌర్జన్యాలతోనే వైసీపీ పాలన సాగిందన్నారు. చంద్రబాబుకు సంఘీభావంగా శ్రీకాకుళం జిల్లా నుంచి సైకిల్ యాత్ర నిర్వహించిన టీడీపీ కార్యకర్తలను బట్టలు ఊడదీయించి టీడీపీ జెండాలను తీసి కాళ్లతో తొక్కడం మరిచిపోలేమన్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో జై జగన్ అనలేదని సుబ్బయ్య అనే టీడీపీ నేతను అన్యాయంగా హింసించారన్నారు. చివరకు జై చంద్రబాబు, జై తెలుగుదేశం అనడంతో అతడిని అతికిరాతకంగా నరికి చంపిన ఘటనను జీవితంలో మరిచిపోలేనన్నారు. అక్రమ కేసులు, హింస, ఇబ్బందులను తట్టుకుని టీడీపీ శ్రేణులు నిలబడటం అభినందనీయమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టాలంటే అందరూ భయపడుతున్నారన్నారు. ఈ క్రమంలో టీడీపీ గెలుపు ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ వందమందిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేయించి గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే అభివృద్ధితో పాటు పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సభలో టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు, ఎన్.శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సూర్యప్రకాశ్‌నాయుడు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.




చెలిమిగడ్డలో పద్మావతి కుటుంబీకులకు చెక్కు ఇస్తున్న భువనేశ్వరి - ఒంటిమిట్టలో శ్రీనివాసులు చిత్రపటానికి నివాళులు

# టీడీపీతోనే మహిళా సాధికారత

కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 21: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమైందని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబుతోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, మళ్లీ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో సాధ్యమైందని చెప్పారు. శాంతిపురంలో జరిగిన మహిళల ముఖాముఖిలో ఆమె మాట్లాడారు. 1986లో మహిళలకు ఆస్తిలో సమాన హక్కు చట్టాన్ని ఎన్టీఆర్ కల్పించారని గుర్తు చేశారు మరెన్నో మహిళా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేశారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థిక స్వావలంబన కలిగించి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, చదువుకున్న ప్రతి ఆడబిడ్డకు ఏడాదికి రూ.15 వేలు ఖాతాల్లో జమ చేస్తారని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు, అరాచకాలు పెచ్చుమీరాయని ఆందోళన వ్యక్తంచేశారు. అక్రమంగా చంద్రబాబు 53 రోజులు జైలులో గడపాల్సి వచ్చినప్పుడు ప్రజలు తమకు ఇచ్చిన మద్దతు, ధైర్యం ఎప్పటికీ మరువలేనని భువనేశ్వరి అన్నారు.

**రాష్ట్ర భవిష్యత్తుకోసమే భువనమ్మ ఆరాటం:** రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల బాగుకోసమే భువనమ్మ కుటుంబం ఆరాటపడుతుందని ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, పంచుమర్తి అనూరాధ అన్నారు. కరోనా సమయంలో ఈ ప్రభుత్వం పట్టించుకోకపోయినా ప్రజల కోసం భర్త చంద్రబాబు, కుమారుడు లోకేశ్ ప్రజల్లోకి వెళ్లి సాయం చేస్తుంటే ఆమె భయాన్ని దిగమింగుకుని గడిపారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించినా కరోనా బాధితులకు ఆక్సిజన్ అందించి ప్రాణాలను కాపాడారని కొనియాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కుప్పంలోని అన్ని కుటుంబాల ఆదాయాన్ని రెట్టింపు చేసే ప్రణాళికలు చంద్రబాబు సిద్ధం చేశారన్నారు. ఎన్నికల్లో అధికార పార్టీ ఇచ్చే తాయిలాలకు ప్రభావితం కాకుండా చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, మాజీ మంత్రి అమరనాథరెడ్డి, జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు నాని, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు అరుణ, నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ, మండల మహిళా అధ్యక్షురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ అవినీతికి ఇదే సాక్ష్యం!

**స్మార్ట్‌సిటీ నిధులతో హోటల్ నిర్మించారంటూ చింతామోహన్ ధర్నా**




కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నినాదాలు చేస్తున్న చింతా మోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 21: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి కపిలతీర్థం వద్ద హోటల్ నిర్మించడం ఏమిటని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి హోటల్ ముందు ధర్నా చేశారు. హోటల్ నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తిరుపతి నగరపాలక సంస్థలో అవినీతి రాజ్యమేలుతోందనడానికి ఇదే సాక్ష్యం అన్నారు. కాగా.. తిరుపతి జూపార్కును మరోచోటుకు తరలించి, ఆ ప్రాంతంలో ఐటీ హబ్ నిర్మించాలని కోరారు. నిరుద్యోగ సమస్య శాశ్వత పరిష్కారానికి ఇది మార్గమని చెప్పారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిటీ అధ్యక్షుడు గోపిగౌడ్, తిరుపతి జిల్లా లీగల్ అధ్యక్షుడు రవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేజోవతి, ఓబీసీ జిల్లా అధ్యక్షురాలు శాంతియాదవ్, సేవాదళ్ అధ్యక్షురాలు మునిశోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

## రాసనపల్లిలో పోలీసుల దాడులు

**● డ్రమ్ముల సహా 50లీటర్ల సారా స్వాధీనం**

**● 1500 లీటర్ల సారా ఊట ధ్వంసం**



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు

గుడిపాల, ఫిబ్రవరి 21: గుడిపాల మండలం రాసనపల్లి అటవీ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఎస్ఐ రామ్మోహన్ తన సిబ్బందితో దాడులు చేశారు. 1500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించిన డ్రమ్ములతో పాటు 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, విక్రేతల గురించి ఆరాతీసి, కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నిసార్లు వారికి కౌన్సిలింగ్ ఇచ్చినా, కొంతమందిలో మార్పు రావడం లేదన్నారు. వారి కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని మారితే, ప్రభుత్వం నుంచి తగిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

## ఇనుప మెట్ల ఏర్పాటుపై అభ్యంతరం

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 21: ముక్కంటి ఆలయంలో ఇనుపమెట్ల ఏర్పాటు పై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ముక్కంటి ఆలయానికి నాలుగు ప్రవేశ ద్వారాలున్నాయి. ప్రతి ద్వారానికి ఒక్కో వైశిష్ట్యాన్ని పురాణాల్లో పేర్కొన్నారు. ఆగమ నియమం ప్రకారం నాలుగు ద్వారాలను గోపురాలు నుంచి రాతి మెట్ల మార్గాలను నిర్మించారు. మూడో ద్వారం తిరుమంజన గోపురం నుంచి భక్తులు రాకపోకలు సాగించేవారు. అయితే ఈ మార్గంలో ఎత్తైన రాతి మెట్లు ఉన్నాయి. వీటిని భక్తులకు అనువుగా మారుస్తున్నామంటూ ఇనుపమెట్లను ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఇది శాస్త్ర విరుద్ధమంటూ సామాజిక మాధ్యమాల్లో భక్తుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపై ఆలయ అధికారులను వివరణ కోరగా... ఇది చాలా విశేషమైన కామ్య మార్గంగా భక్తులు ఆరాధిస్తుంటారని... వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు సైతం ఈ మార్గం నుంచి ఆలయంలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

# సర్వీస్ రోడ్డు లేకుంటే భూముల సాగు ఎలా?

**చిత్తూరు- తచ్చూరు హైవేపై రైతుల నిరసన ● పెండింగ్ నష్టపరిహారం ఇప్పించాలంటూ డిమాండు**



కాళేపల్లెకు సమీపంలో హైవేపై నిరసన తెలుపుతున్న రైతులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 21: 'హైవే కోసం భూములిచ్చాం. మిగిలిన కొంత భూముల్ని సాగు చేసుకోవాలంటే హైవే పక్కన సర్వీసు రోడ్డు లేకుంటే ఎలా?' అని రైతులు ప్రశ్నించారు. చిత్తూరు- తచ్చూరు హైవే పనుల్లో భాగంగా బుధవారం గంగాధర నెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ కాళేపల్లెకు సమీపంలో పలుగ్రామాలకు చెందిన రైతులు టిప్పర్లకు అడ్డంగా నిలబడి నిరసన తెలిపారు. సర్వీస్‌రోడ్డు వేయాలని, రైతులకు పెండింగ్ పడ్డ నష్టపరిహారం విడుదల చేయాలంటూ నినదించారు. హైవే కోసం ఇచ్చిన భూములు పోను కొంతవరకు తమకు మిగిలాయన్నారు. ఆ భూముల్లోకి వెళ్లాలంటే పక్కన 30అడుగుల ఎత్తుతో హైవే ఉండటంతో దారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. భూములు ఇచ్చేటప్పుడు హైవే పక్కన సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేస్తామా లేదా అనే స్పష్టత ఇవ్వలేదని వాపోయారు. ముసలయ్యగారిపల్లె నుంచి బాలగంగనపల్లె సరిహద్దు వద్ద ఏర్పాటుచేసే టోల్‌గేట్ స్థలం వరకు హైవేరోడ్డుకు ఇరువైపుల భూములున్న రైతుల పరిస్థితి ఇబ్బందిగా మారిందన్నారు. దీనిపై ఎన్నిసార్లు అభ్యంతరాలు చెప్పినా.. హైవేరోడ్డుప్లానింగ్ మ్యాప్‌లో సర్వీస్‌రోడ్డు గురించి మార్కింగ్ తెలియజేయలేదని చెబుతున్నారన్నారు. సర్వీస్‌రోడ్డు లేకుంటే తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు. దీనికి తోడు వీఆర్వో శివాజి నిర్వాకం వల్ల ఇంకా కొంతమందికి భూమితో పాటు వివిధ రకాల చెట్లు, బావులకు నష్టపరిహారం రాలేదన్నారు. ఈ నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలని కోరారు.




టీడీపీ జెండాలు, తోరణాలను దహనం చేసిన ఆనవాళ్లు - రోడ్డు పక్కన పడేశారిలా..

# వైసీపీ దాష్టీకం

**● టీడీపీ జెండాలు, తోరణాల దహనం**

వెదురుకుప్పం, ఫిబ్రవరి 21: 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమ నిర్వాహణకు కట్టిన తెలుగుదేశం పార్టీ జెండాలు, పార్టీ తోరణాలను వైసీపీ శ్రేణులు కొందరు పీకేసి దహనం చేశారు. ఈ ఘటన వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీ ధర్మాచెరువు గ్రామంలో జరిగింది. బుధవారం సాయంత్రం జరిగే ఈ కార్యక్రమ నిర్వహణకు పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మోహన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి యుగంధర్ ఆధర్యంలో జెండాలు, తోరణాలను ధర్మాచెరువు క్రాస్ రోడ్డు నుంచి ఉదయాన్నే కట్టారు. వైసీపీ శ్రేణులు కొందరు కార్యక్రమ నిర్వహణకు ముందుగా ఆ తోరణాలను, జెండాలను పీకేసీ ధర్మాచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై దహనం చేశారని తెలుగుదేశం పార్టీ శ్రేణులు తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడటం సముచితం కాదన్నారు. ఈ విషయమై పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ వర్గాలు చెప్పాయి.




# కూలిన వంతెనకు మూడో వార్షికోత్సవం

**ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ వినూత్న నిరసన**

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 21: డప్పుల మోత హోరెత్తింది. టపాసులు పేలాయి. భారీ పూలమాలతో ఊరేగింపు తిరుపతి రూరల్ మండలం చిగురువాడ సమీపంలోని కూలిన వంతెన వద్దకు చేరుకుంది. జాతర సంబరాన్ని తలపించిన ఈ దృశ్యం చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి కుప్పకూలిందని చాటిచెప్పేందుకు ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధా యాదవ్ నిర్వహించిన వినూత్న నిరసన కార్యక్రమం. కూలిన వంతెనకు పూలమాల వేసి, మూడో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. చంద్రగిరి నియోజకవర్గంలో వానల ధాటికి మూడేళ్ల కింద ఐదు బ్రిడ్జిలు కూలిపోయాయని, వాటి అతీగతీ పట్టించుకునే వారే లేరని సుధాయాదవ్ ఆరోపించారు. తాయిలాలపై తాటికాయంత అక్షరాలతో పేర్లు వేసుకొని పంచేందుకు ఉన్న డబ్బులు, అభివృద్ధి పనులకు మాత్రం ఖర్చు చేయరా? అని నిలదీశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిలో చలనం లేనందున, ఆయనకు కనువిప్పు కలగాలనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

## ఐఐటీలో నేడు స్నాతకోత్సవం

ఏర్పేడు, ఫిబ్రవరి 21: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో గురువారం 4, 5వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ముఖ్య అతిథిగా వర్చువల్‌గా ఢిల్లీ నుంచి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు డిగ్రీలను ఐఐటీ డైరెక్టర్ ప్రదానం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవానికి హాజరు కావాలని తిరుపతి ఎంపీతోపాటు శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలకు, కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్ తదితరులకు ఆహ్వాన పత్రికలను రెండ్రోజుల కిందటే పంపారు. మరో ముఖ్య అతిథిగా జేఎస్‌డబ్ల్యూ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ పాల్గొననున్నట్లు డైరెక్టర్ వివరించారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.61కోట్లు లభించింది.సోమవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 62,304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,261 మంది తలనీలాలు సమర్పించారు.



# రేపటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 21: టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. 23న తెలుగు, 24న హిందీ, 26న ఇంగ్లీష్, 27న మ్యాథ్స్, 28న ఫిజికల్ సైన్స్, 29న బయాలజికల్ సైన్స్, మార్చి 1న షోషియల్ స్టడీస్ సబ్జెక్టులకు పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. వీటితో పాటు సమ్మెటివ్ అసెస్మెంట్ 4 పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు 23న తెలుగు, మ్యాథ్స్, 24న సైన్స్, ఇంగ్లీష్, 6 నుంచి 8వ తరగతులకు 23న తెలుగు, మ్యాథ్స్, 24న హిందీ, సైన్స్, 26న సోషియల్, 27న పార్ట్-ఏ, పార్ట్-బి ఇంగ్లీష్ పరీక్షలు జరగనున్నాయి. 9వ తరగతి విద్యార్థులకు 23న తెలుగు, మ్యాథ్స్, 24న హిందీ, సైన్స్, 26న సోషియల్, 27న పార్టు-ఏ, పార్టు-బి ఇంగ్లీష్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహించనున్నారు.

## వాటర్‌షెడ్ పనులపై గ్రామసభ

కల్లూరు, ఫిబ్రవరి 21: పులిచెర్ల మండలం మంగళంపేటలో బుధవారం వాటర్‌షెడ్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన ఆ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీల గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో తేజస్విని మాట్లాడుతూ మంగళంపేట, బోడిరెడ్డిగారిపల్లి వాటర్‌షెడ్డు పరిధిలోని 14 పంచాయతీల్లో 2022-23లో రూ.1.62 కోట్లు ఖర్చుపెట్టామన్నారు. ఈ పథకం కింద చెక్ డ్యామ్‌లు, ఊటకుంటలు, పశువుల నీటి తొట్టిలు, ఫారంపాండ్‌లు తదితర నిర్మాణాలు చేపట్టామన్నారు. రూ.15లక్షలతో సోలార్ లైట్లు, పాఠశాలల్లో బెంచీలు అమర్చడం, పశువైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటిస్తూ పథకంలో చేపట్టిన పనులను పరిశీలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ భాస్కర్, డీఆర్‌పీ జ్ఞానేంద్రరెడ్డి, సర్పంచ్‌లు మధు, వాసుదేవరెడ్డి, టీఏలు దొరైరాజ్, షబ్బీర్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

## రామకుప్పంలో వరుస చోరీలు

రామకుప్పం, ఫిబ్రవరి 21: మండలంలో వరుస చోరీలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఆరిమానిపెంటలో సోమవారం రాత్రి, రాజుపేటలో మంగళవారం రాత్రి దోపిడీ దొంగలు స్వైరవిహారం చేశారు. రూ.2.6లక్షలు విలువైన బంగారు నగలు, రూ.80వేల నగదు దోచుకెళ్లారు. బాధితులు పోలీసులకిచ్చిన ఫిర్యాదుల మేరకు ...ఆరిమానిపెంటకు చెందిన సురేష్ ఉపాధి కోసం కర్నూలుకు వలస వెళ్లాడు. అతని భార్య నదియా గ్రామంలోనే కూలిపనులు చేసుకుంటూ పిల్లలతోపాటు ఆరిమానుపెంటలో ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఆమె ననియాలలోని తన తల్లి జమున ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం స్థానికులు ఆమెకు ఫోన్ చేసి, వారి ఇంటి తలుపులు తెరిచిఉన్నాయని సమాచారమిచ్చారు. దీంతో హుటాహుటిన ఆమె అక్కడకు చేరుకుని చూడగా ఇంట్లోని బీరువా పగులగొట్టి ఉండటాన్ని గమనించింది. బీరువాలోని రూ.1,01,200 విలువైన 22గ్రాముల బంగారు నగలు, రూ.30వేలు నగదు, పిల్లకు సంబంధించి ధ్రువపత్రాల ఫైలు చోరీకి గురైనట్టు గుర్తించింది. దీంతో ఆమె రామకుప్పం పోలీసులకు పిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా చిత్తూరులోని మిట్టూరుకు చెందిన మహేష్‌రెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు ...మహేష్‌రెడ్డి పెద్దమ్మ మాలిని రామకుప్పం మండలం రాజుపేట లో నివాసముంటోంది. ఈనెల 4న ఆమె తన కుమారులను చూసేందుకు ఆస్ట్రేలియా వెళ్లింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం మాలిని వారి ఇంటి తలుపులు తెరచి ఉండగా స్థానికుడు సోమశేఖర్ లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువా పగులగొట్టి ఉండటాన్ని గమనించి, మాలినికి ఫోన్ చేసి చెప్పాడు. మాలిని ఈ విషయాన్ని మహేష్‌కు ఫోన్ చేసి చెప్పగా బీరువాలో రూ.1.60ల విలువైన బంగారు నగలు, రూ.50వేలు నగదు ఉందని ఆమె తెలిపింది. ఆయన రాజుపేటకు చేరుకుని బీరువా లోపల పరిశీలించి అందలో ఎటువంటి నగలు, నగదు లేదని గుర్తించాడు. దీంతో ఆయన రామకుప్పం పోలీసులకు పిర్యాదు చేశాడు. నదియా, మహేష్‌రెడ్డిల పిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

## ఇంటర్ మార్కులే భవిష్యత్తుకు పునాది

గంగవరం, ఫిబ్రవరి 21: విద్యార్థులు ఇంటర్‌మీడియట్‌లో సాధించే మార్కులే భవిష్యత్తుకు పునాదిలాంటివని మధు, శ్రీవాణి విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు కృష్ణమూర్తి రెడ్డి, శ్రీవాణి పేర్కొన్నారు. బుధవారం కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరీక్షలు దగ్గర పడుతుండడంతో సమయం వృథా చేయకుండా చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. అనంతరం క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులను ప్రదానం చేశారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, గోపీనాథ్ రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ ఫలితాలలో పీఈఎస్ విజయభేరి



డి.గౌతమి

కుప్పం, ఫిబ్రవరి 21: వైఎస్సార్ హెల్త్ సైన్స్ బుధవారం విడుదల చేసిన ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ ఫలితాలలో కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్. కృష్ణారావు తెలిపారు.. కళాశాలనుంచి 117 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 111 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఒక డిస్టింక్షన్, 3 ఫస్ట్‌క్లాస్‌లు, 73 సెకండ్‌క్లాసులు ఉతీర్ణత సాధించారన్నారు. 79 శాతం మార్కులతో డి.గౌతమి కళాశాల టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను పీఈఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ దొరస్వామినాయుడు, ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.

## పీఈఎస్‌లో ఎథిక్స్ అవేర్‌నెస్



కుప్పం, ఫిబ్రవరి 21: కుప్పంలోనీ పీఈఎస్ వైద్య కళాశాలలో బుధవారం ఏపీ మెడికల్ కౌన్సిల్ విజయవాడ ఆధ్వర్యంలో ఎథిక్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు ప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థులు తమ వృత్తిలో పాటించాల్సిన నైతిక విలువలు, తప్పు చేసిన పక్షంలో పడే శిక్షల గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై స్పందించాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ప్రభాకర్

సోమల, ఫిబ్రవరి 21: గ్రామా ల్లోని ప్రజా సమ స్యలపై ప్రజా ప్రతినిధులు స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని వైస్ ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల స్థాయి అధికారులు తమ శాఖాపరంగా జరిగిన అభివృద్ధి పనుల వివరాలను సభ్యులకు వివరించారు. వైస్ ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ పలు గ్రామాల్లో మంచినీటి పథకాల బోర్ల నుంచి డైరెక్ట్ పంపింగ్‌తో నీరు వృథాగా పోతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నంజంపేట ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేయాలని ఎంపీటీసీ జిన్నా కోరారు. మైక్రోఫైనాన్స్ కంపెనీలు గ్రామాల్లో పేదలకు రుణాలు ఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని పలువురు సభ్యులు వాపోయారు. సమావేశంలో ఎంపీడీవో వరప్రసాద్, ఏఎంసీ చైర్‌పర్సన్ అరుణ, డీటీ శ్యాంప్రసాద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, ఈవోపీఆర్డీ లక్ష్మిదేవి, ఎంఈవో శివరత్న, పశువైద్యాధికారిణి చందన ప్రియ, వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, విజయలక్ష్మి, ప్రదీప్, ఏపీఎం శివ, ఏపీవో దినకర్‌బాబు పాల్గొన్నారు.



## టీటీడీకి కాయగూరల వితరణ

గంగవరం, ఫిబ్రవరి 21 : టీటీడీకి పలమనేరు మార్కెట్ యార్డు నుంచి 10 టన్నుల కాయగూరలను తరలించినట్లు శ్రీవారి సేవకులు తెలిపారు. బుధవారం పలమనేరుకు చెందిన జైసింగ్ అనే వ్యాపారవేత్త, వారి మిత్రబృందం, హైదరాబాదుకు చెందిన సాయికృష్ణ ప్లాస్టిక్ ఫ్యాక్టరీ అధినేత రమేష్‌బాబు, భారతి, ప్రేమ్‌సాయి, స్వాతిల సహకారంతో 10 టన్నుల అన్నిరకాల కాయగూరలను సేకరించి ప్రత్యేక వాహనంలో తిరుమలకు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, శ్రీవారి సేవకులు కాపుపల్లి రవీంద్రా రెడ్డి, కిషోర్‌స్వామి, సోమశేఖర్ నాయుడు, బాబు తదితరులు గోవిందనామాలు స్మరిస్తూ వాహనానికి ప్రత్యేక పూజలు చేసి తిరుమలకు తరలించారు.

## నేడు బోయకొండలో హుండీ లెక్కింపు

చౌడేపల్లె, ఫిబ్రవరి 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం పాలకమండలి సమక్షంలో హుండీ లెక్కింపు చేయనున్నారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి ఒక పత్రికా ప్రకటన జారీ చేశారు.

# అధైర్యపడకండి.. అండగా ఉంటాం

నారా భువనేశ్వరి



పుంగనూరు శివారులో ప్రజలకు అభివాదం తెలుపుతున్న నారా భువనేశ్వరి, రామకుప్పంలో తెలుగుమహిళలతో కరచాలనం

పుంగనూరు, ఫిబ్రవరి21: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు సందర్భంగా మృతి చెందిన వారి కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆమె పుంగనూరు శివార్లలోని ఆరడిగుంట క్రాస్ వద్దకు రాగానే టీడీపీ శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఎన్ఎస్‌పేటలోని వెంటకప్ప భార్య ఎన్.జయమ్మ కుటుంబీకులను కలసి జయమ్మ చిత్రపటానికి నివాళులర్పించి రూ.3లక్షల చెక్కును అందజేశారు. అనంతరం మంగళం పంచాయతీ చెలిమిగడ్డకు చెందిన చంద్రప్ప భార్య పద్మావతమ్మ, ఒంటిమిట్టకు చెందిన ఎస్. శ్రీనివాసుల నాయుడు ఇళ్లకు వెళ్లి మృతుల కుటుంబీకులకు రూ. 3లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మృతుల కుటుంబీకులతో మాట్లాడి పోలీసు కేసులు, ఇతర సమస్యలపై ఆరా తీశారు. ఒంటిమిట్టలో శ్రీనివాసులు పిల్లలను చదివించడానికి సహాయం చేయాలని వారు కోరారు. టీడీపీ శ్రేణులు తరలిరావడంతో ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.డాబ్కోస్కూల్, వెంకటేశ్వరస్వామి గుడి. కోనేటిపాళ్యం, ఈడిగపల్లెలో రోడ్డుపై అధిక సంఖ్యలో జనం రావడంతో ఆమె కారు ఆపి అందరినీ పలకరించి వెళ్లారు. కార్యక్రమాల్లో నాయకులువెంకటమునియాదవ్, శ్రీకాంత్, దినేశ్, సుహేల్‌బాషా, మాధవరెడ్డి, ఆసూరి బాలాజి, సద్దాంహుసేన్, రామయ్య, శివకుమార్, అమర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవం

**రామకుప్పం** : నిజం-గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం మధ్యాహ్నం 1గంటకు రామకుప్పం వచ్చిన నారా భువనేశ్వరికి పార్టీ శ్రేణులు, ప్రజలు స్థానిక ఆటోస్టాండు వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ ప్రదర్శనగా ఆమె కాలినడకన పోలీస్‌స్టేషన్ సర్కిల్ చేరుకుని అన్నక్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ పాలనలో చంద్రబాబు అన్నక్యాంటీన్లను ప్రారంభించి, రోజూ పేదల ఆకలి తీర్చారన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఉన్న అన్నక్యాంటీన్లను మూసివేయడమే కాకుండా, పలుచోట్ల వాటిని కూల్చివేవారన్నారు. తద్వారా లక్షలాది మంది నోటికాడ నుంచి భోజనాన్ని దూరం చేసిందన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల టీడీపీ నేతలే స్వచ్ఛందంగా అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటి వరకు కేవలం నియోజకవర్గ కేంద్రాలకే పరిమితమైన అన్నక్యాంటీన్లను మండల కేంద్రాలకు విస్తరించాలన్నా ధ్యేయంతో ప్రప్రథమంగా కుప్పం నియోజకవర్గంలోని మూడు మండల కేంద్రాల్లో తాము అన్నక్యాంటీన్లను ప్రారంభిచామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆమె పలువురు మహిళలకు భోజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనూరాధ, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ కుప్పం ఇన్‌చార్జి మునిరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, నాయకులు మునస్వామి, పత్రనారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, విశ్వనాథ్, వెంకటాచలం, రామ్మూర్తి, గంట్లప్పగౌడు, సీతాపతి, శ్రీనివాసులురెడ్డి, మహ్మద్‌రఫీ, జయశంకర్, కృష్ణానాయక్, వెంకటరమణ, సత్తి, రామకృష్ణప్ప, టీవీరవి, బాలరాజు, సలాంసాబ్, ఆదిల్ , సుబ్రీ, సతీష్, మంజునాథ్, అవినాశ్, జ్ఞానశేఖర్‌రెడ్డి, పద్మమ్మ, అలివేలుమంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

పెద్దపంజాణి,ఫిబ్రవరి21: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు సందర్భంగా మృతిచెందిన కుటుంబాలను ఆయన సతీమణి నారా భువనేశ్వరి బుధవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. చంద్రబాబు అరెస్టుతో ఆ వార్తలు టీవీలో చూస్తూ పెద్దపంజాణి మండలం శివాడి గ్రామంలో కనకరాజు ఇంటిలోనే కుప్పకూలి మృతి చెందాడు. మృతుడి భార్య సైతం రెండేళ్ళ క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో వీరి ఇద్దరు అమ్మాయిలు అనాథలయ్యారు. వీరి పరిస్థితి చూసి నారా భువనేశ్వరి వీరికి రూ. 3 లక్షల ఆర్థిక సహాయం చేశారు. అమ్మాయిల చదువులకు అండగా పార్టీ ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం మాదనపల్లె పంచాయతీ కత్తార్లపల్లెలో శంకరప్ప చంద్రబాబు అరెస్టును టీవీలో చూస్తూ గుండెపోటుకు గురయ్యాడు. గ్రామస్తులు వెంటనే వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. తండ్రి మరణాన్ని చూసి అతడి చిన్న కుమారుడు మునిప్రసాద్ మనస్తాపానికి గురికావడంతో మానసిక వైద్య నిపుణులచే చికిత్సలు అందిస్తున్నామని వారు పేర్కొన్నారు. దీంతో ఆ కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించి రూ.3 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. మీ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద, నాగరాజరెడ్డి, మురళీకృష్ణ, రుద్రమూర్తినాయుడు, సుబ్రమణ్యం, చెంగారెడ్డి, శ్రీరాములు, మురహరిరెడ్డి, సుధాకరరెడ్డి, రోజారెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, రెడ్డెప్ప, ముబారక్‌తాజ్, బావాజాన్, నాగరాజ, అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతముందు కత్తార్లపల్లెలో జరిగిన బహిరంగ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నిజం గెలవడానికి మీరు సైయ్యా... అన్నారు. ఈ ఒక్క పిలుపుతో టీడీపీ కార్యకర్తలు మేము సై అంటూ నినాదాలు చేశారు.రాష్ట్రానికి వెలుగులు నింపడం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. 5ఏళ్ళు అధికారం కట్టబెట్టడంతో రాష్ట్రం 50ఏళ్ళ వెనక్కి వెళ్ళిందన్నారు.కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, పులివర్తినాని, శ్రీనాథరెడ్డి, అనూషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పుంగనూరులో ట్రాఫిక్ ఇబ్బందులు

పుంగనూరు, ఫిబ్రవరి 21 : ఇటీవల కాలంలో పుంగనూరులో ప్రయాణమంటేనే ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతున్నారు. కొంతకాలంగా పుంగనూరులో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆక్రమణల తొలగింపు, మురుగుకాల్వల నిర్మాణ పనులు చేపట్టారు. కానీ పనులు ఇష్టారాజ్యంగా పగలు రద్దీ ఉండే ప్రాంతాల్లో వాహనాలు ఆపి నిర్మాణాలు చేపట్టడంతో ఎక్కడికక్కడే వాహనాలు ఆగిపోతున్నాయి. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా వారిని ప్రశ్నించేవారు కరువయ్యారు. చిత్తూరు-మదనపల్లె మార్గంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో తరచూ ట్రాఫిక్ సమస్య ఉంటోంది. దీంతో పలమనేరు రోడ్డు, మదనపల్లె రోడ్డు, కోర్టు బైపాస్ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, చౌడేపల్లె మార్గాల్లో తరచూ ట్రాఫిక్ సమస్య ఉంటోంది. గతంలో ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై ఉండేవారు. గంటల తరబడి వాహనాల రాకపోకలు ఆగిపోతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడంలేదు.పుంగనూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీర్చడానికి జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



# నాణ్యత లేని మందుల వల్ల పంటకు చీడపురుగులు

అందుబాటులో లేని హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు ● ప్రజాప్రతినిధులు ఆగ్రహం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి21: నాణ్యతలేని మందులు, ఎరువులు విక్రయించడం వల్ల పంటలకు చీడపురుగులు పడి పంటను నష్టం చేస్తున్నా సంబంధిత అధికారులు ఏమి చేస్తున్నారని ఎంపీటీసీ నాగభూషణరెడ్డి, సర్పంచ్ సురేంద్రరెడ్డి మండిపడ్డారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకుడు మునికుమార్(బయట వ్యక్తి) సమావేశంలో పాల్గొని గ్రామాల్లో సమస్యలు తీర్చాలని అధికారులను కోరడం ఆశ్చర్యానికి గురిచేసింది. గుర్తించిన ఎంపీపీ బయట వ్యక్తులు సమావేశంలో ఉండరాదని సూచించడంతో బయటకు వెళారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ, సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ఎరువులు, మందులు విక్రయించాలని డిమాండ్ చేశారు. పంటలకు వ్యాప్తి చెందుతున్న చీడలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యవసాయానికి విద్యుత్ కనీసం 7గంటలు కూడా ఇవ్వలేదన్నారు. ఇచ్చే కరెంట్ కూడా వేళాపాళా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు ఇవ్వడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఏఈ శశిధర్ మాట్లాడుతూ చిత్తూరులో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు జరుగుతున్నాయని, త్వరలోనే మరమ్మతులు చేసి 9గంటలు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.మండలంలోని ఆరడిగుంట, ఓబిరెడ్డిపల్లె, కమ్మపల్లె, నేతిగుట్లపల్లె హరిజనవాడ, షికారిపాళ్యం, సింగిరిగుంట హరిజనవాడ ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు అవసరమని సర్పంచులు కోరారు. సమావేశంలో బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ముడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ మునిరెడ్డి, వైస్ ఎంపీపీ లు సరోజమ్మ, ఈశ్వరమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

# శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం

వి.కోట, ఫిబ్రవరి 21: పట్టణంలో వెలసిన దుర్గమ్మ ఆలయ మహా కుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయ మండపంలో కొలువుతీర్చిన పాల కలశాలను ఆలయ ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చి అమ్మవారికి పాలాభిషేకం జరిపించారు. ఆలయం నిర్మించి పుష్కరకాలం పూర్తయిన సందర్భంగా వేదపండితుల సహకారంతో కుంభాభిషేకాన్ని పూర్తి చేశారు. ఆలయం ఎదుట కళాకర్షక హోమం జరిపించారు. సాయంత్రం ఆలయ కళ్యాణ మండపంలో దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఆపై మండపంలో లక్షకుంకుమార్చన చేపట్టారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి స్థానిక టీడీపీ నేతలతో కలసి దుర్గమ్మ సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు అమ్మవారి ఆలయ మండప నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. కల్యాణ మండప నిరాణానికి విరాళాలు అందించిన 300 మందికి దుర్గమ్మ ప్రతిమలను కల్యాణ మండప అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి బహూకరించారు.



పాల కలశాలను తీసుకువస్తున్న మహిళలు, మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

## మాతృభాషపై పట్టు సాధించాలి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి21: విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాల్సివుందని న్యాయవాది వెంకటపతి కోరారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషలో ఉన్న కమ్మదనాన్ని గుర్తు చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు మధుబాల డీఎస్సీ దరఖాస్తు చేస్తున్న విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేశారు. సమావేశంలో గ్రంథాలయాధికారులు తులసీనాయక్, నసీబ్‌జాన్, విశ్రాంత అధ్యాపకుడు రెడ్డెప్పరెడ్డియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాష కళ్లులాంటివి

గంగవరం, ఫిబ్రవరి 21:మన మాతృభాష అయిన తెలుగుభాష కళ్ల లాంటివయితే, పరాయి భాష కళ్లద్దాలు లాంటివని తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. బుధవారం కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. హాజరైన ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాతృభాష తెలుగుపై పట్టుసాధించాలన్నారు. అనంతరం తెలుగు సబ్జెక్టులో ప్రావీణ్యం కనబరచిన పలువురు విద్యార్థులకు రూ.500 చొప్పున పారితోషకంతో పాటు పుస్తకాలను దాత మురళీమోహన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి21: మధ్యాహ్నభోజనంలో నాణ్యత పాటించని డీవైఈవో పురుషోత్తం సూచించారు. బుధవారం గూడూరుపల్లె పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

## నేటి నుంచి వికసిత్ భారత్

గంగవరం,ఫిబ్రవరి21: మదర్‌థెరిసా కళాశాలలో గురువారం నుంచి వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. 2047లో భారత్ ఎలా ఉండబోతుందనే విషయంపై మేధావులు, శాస్త్రవేత్తలు పాల్గొని చర్చించి, విద్యార్థులు, అధ్యాపకుల సందేహాలను నివృత్తి చేస్తారన్నారు.

## గజవాహనంపై కాశీవిశ్వేశ్వరస్వామి



గంగవరం, ఫిబ్రవరి 21: పలమనేరు కాశీవిశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు గజవాహనం పై భక్తులకు దర్శనమిచ్చారు. దాతలు సుగంధి కుమార్ దంపతులు, అరగొండ వెంకటాచలంశెట్టి నీరజ దంపతుల సహకారంతో ప్రత్యేక పూలాంక రణ, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గజవాహనం పై కొలువుదీర్చి ఎంబీటీ రోడ్డు, పాతపేట, వేణుగోపాలస్వామి గుడి వీధి, బజారువీధి, గంగమ్మగుడి వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

## ఘనంగా సల్లాపురమ్మ జాతర



సోమల, ఫిబ్రవరి 21: అన్నెమ్మగారిపల్లె పంచాయతీ టీఎం. గొల్లపల్లె, పెద్దఉప్పరపల్లె పంచాయతీ వడ్డిపల్లె సల్లాపురమ్మ ఆలయాల్లో అమ్మవార్ల జాతరలు ఘనంగా జరిగాయి. బుధవారం అమ్మవార్ల కు ప్రత్యేక పుష్పా అలంకరణలు జరిపారు. భక్తులు సారె, చీరలు సమర్పించారు. ప్రజలు అమ్మవార్లకు దీలు, బోణాలతో మొక్కు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## సదుం ఎంపీడీవోగా రాజశేఖర్ బాబు



సదుం, ఫిబ్రవరి 21: సదుం ఎంపీడీవోగా రాజశేఖర్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పులిచెర్ల మండలంలో ఈవోపీఆర్‌ఆర్‌డీగా పనిచేస్తున్న రాజశేఖర్ బాబు బదిలీపై సదుం ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు.

## సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

సోమల, ఫిబ్రవరి 21: సోమల మండలం పి.చెరుకువారిపల్లెలో కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం సీతారాముల ఉత్సవమూర్తులను పురవీధుల్లో కోలాహలంగా ఊరేగించారు. మహిళలు మంగళహారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## వరకట్నం కేసు నమోదు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి21: కట్నం తీసుకురావాలని భర్త వేధిస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ప్రసీద(26)కు పెద్దమండ్యంకు చెందిన మల్లికార్జునతో ఏడాది క్రితం వివాహం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## యువతి అదృశ్యం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి21: యువతి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణ తెలిపారు. బుధవారం పట్టణంలోని రాంనగర్‌కు చెందిన శంకర్ కుమార్తె మంగళవారం పశువులు మేపడానికి వెళ్లి సాయంత్రం ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సీఎం సహాయనిధి అందజేత

రామకుప్పం, ఫిబ్రవరి 21: రామకుప్పానికి చెందిన శివమ్మ అనారోగ్యం బారిన పడి వివిధ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంది. ఆమె కుటుంబసభ్యులు వైద్యఖర్చులకు అధికమొత్తంలో ఖర్చు పెట్టడంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం వారికి మంజూరు చేసిన రూ.1.80లక్షల చెక్కును ఎమ్మెల్సీ భరత్ శివమ్మ భర్త శ్రీనివాసులుకు అందజేశారు.

## వైసీపీని ఓడించేందుకు ప్రజలు 'సిద్ధం': దొరబాబు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 21: వైసీపీని ఓడించేందుకు ప్రజలు 'సిద్ధం'గా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. బుధవారం నగరంలోని 14వ డివిజన్ టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. దొరబాబు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఉన్న సుమారు 100 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసి ప్రజలకు అన్యాయం చేసిందని చెప్పారు. మద్యపాన నిషేదాన్ని అమలు చేసిన తర్వాతే తిరిగి ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్.. ఏ మొఖంతో ఇప్పుడు ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అనంతరం స్థానికులకు టీడీపీ మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు కటారి హేమలత, వెంకటేష్ యాదవ్, రాజశేఖర్, లక్ష్మీపతి, శంకర్, రాణి, వరలక్ష్మి, భార్గవి, ధనంజయబోయిడు, రమేష్ నాయుడు, రవి, తామస్, సుందర్‌రాజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: థామస్



కరపత్రం ఇస్తున్న డాక్టర్ థామస్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 21: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ద్వారానే ఏపీ రాష్ట్రాభివృద్ధి, పేదలందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు సాధ్యమని గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ తెలిపారు. మండలంలోని మాంబేడు గ్రామ పంచాయతీ ధర్మాచెరువు గ్రామంలో బుధవారం మాంబేడు పంచాయతీ కమిటీ అధ్యక్షులు మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి యుగంధర్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ థామస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేయ్యాలని చెప్పారు. వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, ఓటు ద్వారా చరమగీతం పాడాలన్నారు. ధర్మాచెరువు గ్రామంలో ఇంటింటికీ బాబు ష్యూరిటీ కరపత్రాలను ఇచ్చారు. టీడీపీ మండలాధ్యక్షులు కామసాని లోకనాథరెడ్డి (వెదురుకుప్పం), చెంగల్రాయయాదవ్ (కార్వేటినగరం), నేతలు గుండయ్య, గురుసాల కిషన్‌చంద్, బట్టే చాణిక్యప్రతాప్, గాలి బాబు నాయుడు, బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, కుప్పయ్య, బీగాల రమేశ్, శివరాం యాదవ్, మోహన్‌యాదవ్, యుగంధర్, ఎం.రాజశేఖర్‌వర్మ, లోకనాథరెడ్డి, రజనీకాంత్, కుమార్, చెంగల్‌పండు, చిన్నమరెడ్డి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరంగరాజపురం:** డి.కె. మర్రిపల్లి గ్రామ పరిధిలోనే గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ, ఇంటింటికీ మన థామస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ థామస్ ఇంటింటికి వెళ్లి టీడీపీ ఆరు హామీల గురించి ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు రాజశేఖర్ నాయుడు, కోటి, మహేష్, అరుణ, బాబు నాయుడు, రవి, కుమార్, భాస్కర్ నాయుడు, ప్రకాస్, మహేష్, పుల్లూరు బాబు, నీరంజన్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, బ్రహ్మ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.







## అరుణగిరి క్షేత్రంలో ప్రదోషకాల పూజలు



వెదురుకుప్పం, ఫిబ్రవరి 21: మండలం డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రదోషకాల పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కొండ మల్లీశ్వరస్వామికి, నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నమయ్య, శివ సంకీర్తనలను ఆలపించారు. భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## వైభవంగా వినాయక ఆలయ కుంభాభిషేకం

పెనుమూరు, ఫిబ్రవరి 21: పెనుమూరులోని కమ్మవీధి వద్ద నూతనంగా నిర్మించిన మహాగణపతి ఆలయ కుంభాభిషేకం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల అభిషేకాలు చేశారు. కలశ స్థాపన చేసి స్వామివారిని అలంకరించి పురవీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. గురువారం అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## బల్క్‌మిల్క్ సెంటర్ ప్రారంభం

పూతలపట్టు, ఫిబ్రవరి 21: మండలపరిధిలోని పోలవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బల్క్‌మిల్క్ సెంటర్‌ను పంచాయతీ అధికారులు బుధవారం ప్రారంభించారు. స్థలదాత అరుణ, సర్పంచ్ నిర్మలమ్మ, ఎంపీటీసీ క్రిష్ణమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక

నగరి, ఫిబ్రవరి 21: నగరి పట్టణం, మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలిగా పంచవర్ణ, అధ్యక్షురాలిగా షీలా, కార్యదర్శిగా ధనకోటి, కోశాధికారిగా వనిత, ఉపాధ్యక్షురాళ్లుగా మైథిలి, వరలక్ష్మి, సహాయకార్యదర్శులుగా షర్మిల, అరుణతో బాటు 10 మందిని కమిటీ సభ్యులుగా ఎంపికచేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం ప్రకటించిన జీఓలను విడుదల చేయాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చే శారు. 42 రోజుల పాటు పోరాటం చేసినందుకు ప్రభుత్వం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఇచ్చిన మినిట్స్ ప్ర కారం సమస్యలను పరిష్కరించడానికి వెంటనే జీఓలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఉద్దేశపూర్వకంగానే మీడియాపై వైసీపీ శ్రేణుల దాడులు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 21: వైసీపీ శ్రేణులు ఉద్దేశపూర్వకంగానే మీడియాపైన దాడులు చేస్తున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, సీఎం జగన్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించే గళం వింటే ఆయనకు గిట్టదని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఒత్తిడికి లోనై ఇలా దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. మీడియాపైన దాడులు చేయడం జగన్ నిరంకుశ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ రెడ్డికి ఓటమితో పాటు పరాభవం తప్పదని ఆప్రకటనలో తెలిపారు.

## వలంటీర్లకు పురస్కారాలు

ఐరాల, ఫిబ్రవరి 21: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం పూతలపట్టు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త సునీల్‌కుమార్ వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ ఛైర్ పర్సన్ శైలజాచరణ్‌రెడ్డి, నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి



బీజేపీ పతాకాన్ని ఎగురవేస్తున్న నాయకులు

నగరి, ఫిబ్రవరి 21: నగరి నియోజకవర్గం బీజేపీ కార్యాలయాన్ని బుధవారం మధ్యాహ్నం నగరి పట్టణ పరిధిలోని బ్రాహ్మణవీధిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. బీజేపీని బలోపేతం చేయడానికే నియోజకవర్గ కేంద్రమైన నగరిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రమేష్ నాయుడు, ఓబీసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, జలజాక్షి, నాయకులు భువనేశ్వరి, వేలాయుధం, రాము, చంద్రరాజు, రామ్మూర్తియాదవ్, మునికృష్ణమ నాయుడు, జగదీష్, మోహన్, కెఎన్‌హరి, శివ, రాజేంద్ర పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## రైతుభరోసా కేంద్రం ప్రారంభం

నగరి, ఫిబ్రవరి 21: నగరి మండల పరిధిలోని వీకేఆర్ పురంలో రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను బుధవారం మంత్రి రోజా ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, వ్యవసాయాధికారి రాఘవేశ్వర్‌యాదవ్, ఎంపీపీ భార్గవి పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## 'బర్డ్‌ఫ్లూ'పట్ల అప్రమత్తంగా ఉండాలి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 21: కోళ్ళకు సంక్రమిస్తున్న బర్డ్ ఫ్లూ వ్యాధిపట్ల ఆ కోళ్ళ పెంపకందారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంగాధరనెల్లూరు వెటర్నరీశాఖ ఏడీ డాక్టర్ మురళీమోహన్ అన్నారు. నెల్లూరు జిల్లాలో ఇటీవల కోళ్ళకు బర్డ్ ఫ్లూ వ్యాధిసోకినట్లు నివేదికల ద్వారా తెలిసినందున, గంగాధరనెల్లూరు మండలం కలిజవేడు పంచాయతీ కె.నాశంపల్లెలో కోళ్ళఫారాన్ని బుధవారం వెటర్నరీ అధికారులు తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కోడి మాంసాన్ని, గుడ్లను బాగా ఉడకబెట్టి తింటే ఎలాంటి ప్రమాదం జరగదన్నారు. ప్రతి కోళ్ళఫారం ముందు ఫుట్‌పాత్ సౌకర్యాన్ని ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఫార్మాలిన్ లేదా సోడియం హైపోక్లోరిట్ మందును వాడితే కోళ్ళద్వారా వ్యాధులు రావని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎట్టేరి వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు, కోళ్ళఫారం నిర్వాహకులు పాల్గొన్నారు.


## మీడియాపై దాడి అమానుషం



నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

గుడిపాల, ఫిబ్రవరి 21: అనంతపురం జిల్లా రాప్తాడులో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్య అని, వీటికి తోడు కొడాలి నాని మీడియాపై చేసిన వ్యాఖ్యలను మండల దళిత నాయకులు ఖండించారు. బుధవారం చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. సర్పంచ్ అరుణ్, దళిత నాయకులు చంద్రమోహన్, రవి, చల్లా, గోపి, ధనసింగ్, కిట్టు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ నేత కుటుంబానికి భాను పరామర్శ



నివాళి అర్పిస్తున్న గాలి భానుప్రకాశ్

విజయపురం, ఫిబ్రవరి 21: మండలంలోని జంబాడలో ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు శంకర్ రాజు కుటుంబాన్ని బుధవారం నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పరామర్శించారు. శంకర్‌రాజు మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, నాయకులు రవిరాజు, సుబ్రహ్మణ్యం రాజు, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ బ్యాంకులో మరిన్ని సేవలు

గుడిపాల, ఫిబ్రవరి 21: ప్రజలకు మరిన్ని సేవలను అందించేందుకు గుడిపాల సప్తగిరి బ్యాంకు ముందుందని మేనేజర్ రజనీకాంత్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తక్కువ వడ్డీతో బంగారు ఆభరణాలపై రుణాలు, క్రాప్ లోన్లు మంజూరు చేస్తున్నామన్నారు. డిపాజిట్లు చేసేవారికి ఎక్కువ శాతం వడ్డీలు చెల్లిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఏటీఎం సేవలు అందిస్తామన్నారు.

## 'రా... కదలిరా'ని విజయవంతం చేయండి

గుడిపాల, ఫిబ్రవరి 21: ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించే రా... కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో టీడీపీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, వసంతాపురం ఎంపీటీసీ విజయలక్ష్మి జయదేవ నాయుడు, నాయకులు రవి నాయుడు, ధనసింగ్, అరుణకుమార్, చల్లా, మహదేవ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను గాలికొదిలి...

## పేర్లు పెట్టుకోవడానికే పరిమితం

● నగరపాలక సంస్థ బడ్జెట్ అంచనా రూ. 274.93 కోట్లకు కౌన్సిల్ ఆమోదం



సమావేశానికి హాజరైన మేయర్ అముద, కార్పొరేటర్లు

చిత్తూరు, ఫిబ్రవరి 21: చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశమంటే ప్రజా సమస్యలను చర్చించడంతో పాటు అన్నివర్గాలను దృష్టిలో ఉంచుకుని నిధుల కేటాయింపు, అభివృద్ధి పనులను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే అంశాలపై చర్చించడమే ముఖ్య ఉద్దేశం. అయితే బుధవారం మేయర్ అముద అధ్యక్షతన జరిగిన నగరపాలక సంస్థ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మాత్రం వీధులకు, రోడ్లకు పేరు పెట్టుకోవడానికే పరిమితైంది. ఉదయం 11గంటలకు సర్వసభ్య సమావేశమని నిర్ణయించారు. ఆ సమయానికి కోరంకు సరిపడే సభ్యులు రాకపోవడంతో.. అరగంట ఆగి సభ్యులకు ఫోన్లు చేసి, వారు వచ్చిన తరువాత సమావేశాన్ని ప్రారంభించారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం సభ్యులంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని నగరంలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటినుంచే తగిన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు.

● **పేర్లు పెట్టుకోవడానికే సమయమంతా...**

సమావేశంలోని అజెండాలో 10 అంశాలను పొందుపరిచారు. అందులో స్వాతంత్ర్య సమరయోధుడు చిన్నమరుదు పెరియమరుదు విగ్రహాల ఏర్పాటుకు సభ్యులు ఆమోదించారు. అదేవిధంగా పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి అంబేడ్కర్ భవన్ వరకు ఉన్న రోడ్డును కేబీఆర్ మ్యాంగో భవన్ రోడ్డుగా, కట్టమంచి నుంచి సాంబయ్యకండ్రిగ వరకు ఉన్న రోడ్డును డాక్టర్ సీఆర్‌రెడ్డి బైపాస్ రోడ్డుగా, చెరువు వీధిని పొన్నుస్వామి నాయకర్ వీధిగా నామకరణం చేయడానికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అదేవిధంగా చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రదేశాల నుంచి గ్రావెల్, మొరం, సాధారణ మట్టిని తీసుకెళ్ళడానికి ఐదు ప్రైవేటు కంపెనీలు కౌన్సిల్ ఆమోదం కోరాయి. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, ఇరువారం టీడీపీ కార్పొరేటర్ అశోక్ మాట్లాడుతూ వీటి వల్ల నగరపాలక సంస్థకు ఏ మేరకు ఆదాయం వస్తుందో చెప్పాలని కోరారు. ఆదాయమేమి రాదని టౌన్‌ప్లానింగ్ అధికారులు సమాధానం ఇవ్వడంతో సంతృప్తిచెందని సభ్యులు పూర్తి వివరాలు తెలుసుకున్న తరువాతనే ఆమోదిస్తామని, అంతవరకు పెండింగ్‌లో పెట్టాలని సూచించగా, సభ్యులు ఆమోదం తెలిపారు. నగరంలోని ఎంఎస్‌ఆర్ టౌన్ హాలు పక్కన ఉన్న ఖాళీస్థలాన్ని కమలహాసన్ అనే వ్యక్తి మూడేళ్లకు లీజుకు తీసుకున్నాడు. లీజుకాలం ముగియడంతో కొత్తగా టెండరు ద్వారా లీజుకు ఇవ్వాలని కార్పొరేటరు అలీ కోరగా.. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున లీగల్ ఒపీనియన్ తీసుకున్న తరువాతనే లీజుకు ఇవ్వాలని డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తెలిపారు. దాంతో లీగల్ ఒపీనియన్ తీసుకున్న తరువాతనే లీజుకు ఇవ్వాలని సభ్యులు పెండింగ్‌లో పెట్టారు. ● సర్వే నెంబరు 515-5లో ఉన్న 8.45 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇంటి స్థలం మంజూరు చేయడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నగరంలోని కైలాసపురం శ్మశానవాటికలో క్రిమేషన్ మిషన్ ఏర్పాటుకు, నిర్వహణ బాధ్యతలను ఆర్యవైశ్య సంఘం తరుపున లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సర్వీస్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తామని కోరగా కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు.

● **నగరపాలక సంస్థ బడ్జెట్ అంచనా రూ. 274.93 కోట్లు**

చిత్తూరు నగరపాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో నగరపాలక సంస్థకు సాధారణ, మూలధన జమల ద్వారా రూ.274.93 లక్షలు వస్తుండగా రూ.265.36 కోట్లు సాధారణ మూలధనం వ్యయంగా అంచనా వేశారు.

## ఓటర్ల జాబితాలో సవరణలు చేపట్టండి

● డీఆర్వోకు టీడీపీ నాయకుల అభ్యర్థన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 21: ఓటర్ల తుది జాబితా నేటికీ తప్పుడు తడకలుగా ఉందని, అధికారులు ఎప్పటికైనా సవరణ చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. బుధవారం డీఆర్వో సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి. సురేంద్ర కుమార్ మాట్లాడుతూ పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో మృతిచెందినవారి పేర్లతో పాటు డబుల్ ఎంట్రీలు అత్యధికంగా ఉన్నాయంటూ బీఎల్వోల దృష్టికి తీసుకెళ్ళినా సవరించడం లేదని ఆరోపించారు. డీఆర్వో సమాధానమిస్తూ అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదికలను ఎన్నికల కమిషన్‌కు పంపుతున్నామన్నారు. అక్కడి నుండి అందిన తర్వాత తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. అర్హత ఉంటే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), భాస్కర్, పరదేశి (కాంగ్రెస్), భాస్కర్ (బీఎస్పీ), గంగరాజు (సీపీఎం), ఉదయ్‌కుమార్ (వైసీపీ), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ప్రసాద్ బాబు, ఐటీ వింగ్ అధికారి ఉమాపతి, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు సేవాగుణం కలిగి ఉండాలి

● అపోలో హాస్పిటల్స్ జేఎండీ డాక్టర్ సంగీతా రెడ్డి

● ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీల ప్రదానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సంగీతా రెడ్డి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 21: నేటి సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మురకంబట్టులోని అపోలో మెడికల్ కళాశాలలో 2వ బ్యాచ్ ఎంబీబీఎస్ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంగీతా రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా వైద్య విద్య సమగ్ర స్వరూపం మారాలని అన్నారు. వైద్యులు సేవాగుణం కలిగి ఉండాలని ఆమె సూచించారు. అపోలో కళాశాల వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్ భట్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి విద్య కోసం అంతర్జాతీయ విద్యార్థుల రాకను అంచనా వేస్తూ సంస్థ భవిష్యత్తు కోసం డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి చూపిన దూరదృష్టిని కొనియాడారు. అంతకుముందు క్యాంపస్‌లో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ర్యాలీ నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంబీబీస్ డిగ్రీని పూర్తి చేసుకున్న 146 మంది విద్యార్థులకు సంగీతారెడ్డి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అపోలో సీఈవో శివరామకృష్ణన్, సీఓఓ నరేష్ కుమార్‌రెడ్డి, వైద్యాధిపతులు ఆల్‌ఫ్రెడ్, సుధాకరబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల్లో ఘనంగా మాతృభాషా దినోత్సవం



పిన్ని సుబ్రమణ్యంశర్మను సన్మానిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు (సెంట్రల్/కల్చరల్), ఫిబ్రవరి 21: నగరంలోని పలు విద్యాసంస్థల్లో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సంతపేటలోని బృందావన్ పాఠశాలల్లో కరస్పాండెంట్ శైలజాకుమారి అధ్యక్షతన హరివిల్లు కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భాషాభూషణ పిన్ని సుబ్రమణ్యశర్మ పాల్గొన్నారు. మాతృభాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్వాన్ భాస్కర్‌రెడ్డి, హరివిల్లు అధ్యక్షుడు హరి నాయుడు, గోవిందన్ పలువురు మాతృభాషలోని ప్రాముఖ్యతలను వివరించారు. అనంతరం సుబ్రమణ్యంశర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన జరిగింది. తెలుగు శాఖాధ్యక్షులు ఉషారాణి, హిందీ శాఖాధ్యక్షులు అక్తర్, ఆంగ్ల ఉపన్యాసకురాలు రాజ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**తవణంపల్లె:** మండలంలోని అరగొండ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థినులకు మాతృభాష గొప్పతనం గురించి వ్యాసరచన పోటీలు, పాటలు, పద్యాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మమత, లలిత, ఈశ్వర్‌శెట్టి పాల్గొన్నారు.

**కార్వేటినగరం:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష అధ్యయన శాఖ అధ్యాపకులు సుబ్బారావు తెలుగు భాష ఔన్నత్యం గురించి వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

## సిమెంట్ బెంచీల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు



ధ్వంసమైన సిమెంటు బెంచీలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 21: జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సిమెంటు బెంచీలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై బుధవారం వన్‌టౌన్ పోలీసులకు జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు, స్థానిక కార్పొరేటర్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో జీజేఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా నగరంలోని 10వ డివిజన్ సత్యనారాయణ పురం ఆటోస్టాండ్ వద్ద స్థానిక కార్పొరేటర్ శేషాద్రి నాయుడి విజ్ఞప్తి మేరకు సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. కాగా మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సిమెంటు బెంచీలను ధ్వంసం చేశారు. ఈ మేరకు కార్పొరేటర్‌తో పాటు జీజేఎం ఫౌండేషన్ నిర్వాహకులు ఈశ్వర్, సాయి, ఆర్ఎస్ నాయుడు, జగన్, సుధాకర్ నాయుడు తదితరులు బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెంచీలను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో వారు కోరారు.

## పేటమిట్ట కోదండరామస్వామి సేవలో టీటీడీ చైర్మన్ భూమన



గల్లా దంపతులతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

పూతలపట్టు, ఫిబ్రవరి 21: పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన సతీమణి రేవతి దంపతులు బుధవారం సందర్శించారు. వీరికి అమరరాజా సంస్థల అధినేతలు, ఆలయ ట్రస్టు అధ్యక్షులు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లను చేయించారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## కమనీయంగా కోదండరాముడి కల్యాణం



అమ్మవారి మాంగల్యాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 21: స్థానిక కోదండరామాలయంలో బుధవారం స్వామి వారికి అత్యంత కమనీయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణుగోపాల్ బృందం వైష్ణవ సంప్రదాయంలో నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవంలో మాంగల్యధారణ, తలంబ్రాలు, ఎదుర్కోళ్ల ఘట్టాలను భక్తులకు కనువిందు చేసే విధంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ అక్షింతలను, తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంట్ ప్రసాద్ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు, దేవదాయశాఖ సిబ్బంది చెంగల్‌రాయలు, రెడ్డెప్ప, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## వేసవిలో తాగునీటి సమస్య రానీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గీత

తవణంపల్లె, ఫిబ్రవరి 21: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గీత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాఖలవారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీలు ప్రతాప్ రెడ్డి, శోభ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సకాలంలో వ్యాధిని గుర్తించాలి: డీఎంహెచ్‌వో



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో తదితరులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 21: ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించి సకాలంలో వ్యాధిని గుర్తిస్తే రోగి ప్రాణాలను కాపాడవచ్చునని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. బుధవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లకు రెండురోజుల పాటు నిర్వహించే నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు వస్తాయన్నారు. వాటిని గుర్తించేందుకు నూతన టెక్నాలజీలను వాడుకొని వ్యాధిని త్వరగతిన నిర్ధారించాలన్నారు. అనంతరం దోమల కారక వ్యాధులపై అవగాహన కలిగించే కరపత్రాలను విడుదల చేశారు. డీఐవో రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

## పాపమ్మకు టీడీపీ నేతల నివాళులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 21: మండలంలోని నెల్లేపల్లి పంచాయతీకి చెందిన జిల్లా టీడీపీ యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ నాయనమ్మ పాపమ్మ(90) మంగళవారం మరణించారు. ఈసమాచారం తెలుసుకుని బుధవారం నెల్లేపల్లెమిట్టలో పాపమ్మ భౌతికకాయానికి పలువురు టీడీపీనేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, తెలుగురైతు అధ్యక్షుడు నాగేశ్వరాజు, గంగాధరనెల్లూరు, కార్వేటినగరం మండల టీడీపీ అధ్యక్షులు స్వామిదాస్, చెంగల్రాయ యాదవ్, నేతలు కామసాని కోదండరెడ్డి, జ్యోతిరెడ్డి, రవియాదవ్, జ్యోతియాదవ్, సుబ్రమణ్యం, మునిరాజులుయాదవ్, ప్రసాద్ నాయుడు నివాళులు అర్పించిశ్రీధర్‌యాదవ్‌ను పరామర్శించారు.

## వైభవంగా కుంభాభిషేకం

నగరి, ఫిబ్రవరి 21: నగరి పట్టణ పరిధిలోని సత్రవాడలో పాంచాలమ్మ సమేత పాండవుల ఆలయ కుంభాభిషేకం బుధవారం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య యజ్ఞ యాగాదులతో కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. మంత్రి ఆర్కే రోజా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.